విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 5, మే 2025

సజావుగా నీట్ పరీక్షలు ..

తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్ (యూజి) -2025) పరీక్షలను కలెక్టర్ వినోద్ కుమార్.వి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా నీట్ పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ట

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామంలో ఆదివారం వేద పండితులతో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట నిర్వహించారు. మూడు రోజులుగా వేద పండితుల చేత హెూమం కాలుస్తూ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట చేయడం జరిగింది. ఇంటి ఇంటికి ఆడపడుచులకు వడి బియ్యం పోస్తూ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ట జరుపుకున్నారు.

ఆర్డిటి సేవలు కొనసాగించాలి

6న రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-ఉరవకొండ: జిల్లాలో ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ సేవలును కొనసాగించాలని కోరుతూ ఈనెల 6 వతేదీన స్థానిక తొగట వీరక్షత్రియ కళ్యాణ మండపంలో ఈనెల 6న రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, వైఎస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, పార్టీ రూరల్ సమన్వయకర్త ఎర్రిస్వామిరెడ్డిలు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సుదీర్ఘ కాలం పాటు అత్యంత కరువు పీడిత అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, పర్యావరణం, పక్కా గృహాల నిర్మాణం లాంటి అనేక గొప్ప కార్యక్రమాలను ఆర్డీటీ చేపట్టిందన్నారు. ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ఫెర్రర్ జిల్లా రూపురేఖలు మారేవిధంగా పేదరికం పాలద్రోలడానికి కృషి చేశారన్నారు. అలాంటి ఆర్డీటీ సేవలు నిలిచిపోయేలా కేంద్రం నిర్ణయం తీసుకోవడం బాధకరమన్నారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోతే ఎస్సీ, ఎస్టీల జీవితం మరింత దుర్భరంగా మారుతుందన్నారు. ఈ అంశంపై చర్చించడానికి ఈనెల 6న అన్నీ రాజకీయపార్టీలు, వామపక్ష పార్టీలు, కులసంఘాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛందసేవాసంస్థ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాధ్, ఆపద్బాంధవ ట్రస్టు ప్రతినిధి మురళీ, నూర్బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నభీమా, కిష్టయ్య, ఎర్రిస్వామిలు పాల్గొన్నారు.

టెక్నాలజీతో భవిష్యత్తుకు దారులు

విశాలాంధ్ర-రాప్తాడు: ఆధునిక సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో నేటి విద్యార్థులు దాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవశ్యకత ఉందని మాంటిసోరి ఎలీట్ పాఠశాల ఎండి కృష్ణ భరత్ సూచించారు. మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలీట్ పాఠశాలలో ఆదివారం మాంటిస్సోరి ఎలిట్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ హైదరాబాద్ చెందిన ఎడ్యుకేటర్స్ అరేనాతో కలిసి అకాడమిక్ ఒడిస్సీ- ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ భవిష్యత్తుకు దారులు అనే కార్యక్రమాన్ని నిర్వహించగా దేశవ్యాప్తంగా 15కు పైగా ప్రముఖ యూనివర్సిటీలు పాలుపంచుకున్నాయి. ఎండి కృష్ణ భరత్ మాట్లాడుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో విద్యార్థులకు ఇలాంటి వేదికను అందించడం ఆనందంగా ఉందని విద్యార్థులు తాము ఎంచుకునే భవిష్యత్తు కోర్సులపై స్పష్టత కలిగించేందుకు ఇది గొప్ప అవకాశం ఉన్నారు. ఎడ్యుకేటర్స్ అరేనా మేనేజర్ క్రాంతికుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీలను విద్యార్థులకు పరిచయం చేయడం గర్వకారణం అన్నారు.

గ్రూప్ 1 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు..



విశాలాంధ్ర-అనంతపురం క్రైం : జిల్లాలో వేర్వేరుగా జరుగుతున్న ఏపిపిఎస్సి గ్రూప్-1 మెయిన్స్ ఎన్ఈఈటి పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద డిఎఫ్ ఎమ్‌డిలు, హెచ్ ఎప్ ఎండిలు ల ద్వారా చెక్ చెసి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి పంపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేకుండా క్షుణ్ణంగా చెక్ చేసి పంపారు.

సీనియర్ సిటిజన్ కార్డులు వృద్ధులు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-యాడికి: సీనియర్ సిటిజన్ కార్డులు వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి మురలీకృష్ణ విజ్ఞప్తి చేశారు, మురలీకృష్ణ మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తుందన్నారు, వీరి ఆధార్ కార్డు,పాన్ కార్డు , బ్లడ్ గ్రూప్ వయసు ధ్రువీకరణ పత్రం ఫోటో తీసుకుని గ్రామ, వార్డు సచివాలయంలో మీ సేవా, ఇంటర్నెట్ సెంటర్లో నమోదు చేసుకుంటే కార్డు ద్వారా రైలు ప్రయాణం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో , ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య సేవలు ప్రత్యేక సదుపాయం, బ్యాంకుల్లో డిపాజిట్ స్కీములు రాయితీ పొందవచ్చన్నారు.

వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్టు ఉపసంహరించుకోవాలి

యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్, అనంతపురం నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు దాదా గాంధీ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఇటీవల కేంద్రం పార్లమెంటులో పాస్ చేసిన వక్ఫ్ అమెండ్మెంట్ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలి యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండు చేసింది. ఆదివారం యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురంలో విలేకరుల సమావేశంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సి.జాఫర్, అనంతపురం మేయర్ వస్త్రములు ఖాన్, అనంతపురం నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు దాదా గాంధీలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ అమెడ్మెంట్ యాక్టును ఉపసంహరించుకోవాలని, అదేవిధంగా మే 5 తేదీన సుప్రీంకోర్టు అత్యున్నత న్యాయస్థానం తీర్పు ముస్లిం మైనార్టీలు, లౌకికవాదులు, ప్రజలు ఆశించిన రీతిలో ఉంటుందని భావిస్తున్నామని వక్ఫ్ యునైటెడ్ ఫోరం వారు అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14, 15 సమాన హక్కులు కల్పించిందని, ఆర్టికల్ 25, 26 ఏ వ్యక్తి అయినా మతాన్ని స్వీకరించి ఆచరించే హక్కు ఉందని, ధార్మిక కార్యకలాపాలు నిర్వహించుకునేటువంటి హక్కు ఉందన్నారు,. దీనిని ఉల్లంఘిస్తూ చట్టాలు చేసిందన్నారు. అంతేకాకుండా రాజ్యాంగం పట్ల విశ్వాసం లేని వారు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పైన కూడా విమర్శలు చేస్తున్నారని, జార్కండ్ ఎంపీ నిషికాంత్ దూబే, అంతర్యుద్ధం వస్తే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ కన్నా బాధ్యత వహించాలని కోరారు. కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. జార్ఖండ్ ఎంపీ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండు చేసింది.

శాంతియుత మానవహారానికి అనుమతి ఇవ్వాలి

విశాలాంధ్ర-అనంతపురం : వక్ఫ్ సవరణ బిల్ చట్టం సమంజసం కాదని ముస్లిం సమాజం ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డ్ పిలుపుమేరకు అనంత యునైటెడ్ ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ శాంతియుత మానవహారానికి అనుమతి కల్పించాలని ముస్లిం యూ జె ఏ సి కన్వీనర్ సి. జాఫర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నేత్ర ఆస్పత్రి పైనున్న సమావేశ మందిరంలో ముస్లిం యూ.జె.ఏ.సి సభ్యులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ వసీం, మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీలు మాట్లాడుతూ... మానవహార కార్యక్రమం ద్వారా ట్రాఫిక్కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా 15 నిమిషాల కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని డీఎస్పీని కోరామన్నారు. ప్రజాస్వామ్య నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఖండిస్తోందన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కూడా లక్షలాది ఎకరాలు భూములు ఉన్నాయని వాటిలో కూడా ఎన్నో జరిగాయని వాటిని సవరించకుండా కేవలం ముస్లిం సమాజానికి ఉన్న ఆస్తులపై సవరణలు చేయడం పట్ల కేంద్ర ప్రభుత్వం దురుద్దేశాన్ని ముస్లిం సమాజానికి అర్థమవుతుందన్నారు. సవరణ ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. ప్రజా స్వామ్యంగా నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని అనుమతి ఇచ్చి మరల రద్దు చేయడం కరెక్ట్ కాదని అవసరమైతే జిల్లాలోని ఉన్నతాధి కారులను కూడా కలిసి అనుమతివ్వాలని విజ్ఞప్తి చేస్తావ ఎన్నారు. సమావేశంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సైఫుల్ల బేగ్, రిజ్వాన్, ఖాజా, గోల్డ్ భాష, జాకీర్ హుస్సేన్, హాజిపిరా, జక్రియ, జావేద్, నజీర్ పాల్గొన్నారు.

మానవాళికి భగీరథ మహర్షి అందించిన సేవలు ఎనలేనివి

- లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శం
- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి
- భగీరథ మహర్షికి ఘన నివాళి

విశాలాంధ్ర-అనంతపురం: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ దగ్గర గల కేర్ క్యూర్ హాస్పిటల్ ఎదురుగా వున్న భగీరథ మహర్షి విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కేర్ , క్యూర్ హాస్పిటల్ ఎదురుగా వున్న భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించామని, జిల్లా ప్రజలు అందరికీ భగీరథ మహర్షి జయంతి మహెూత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మానవ ప్రయత్నంతో చాలా పెద్ద సాధనను చేయొచ్చు అనేదానికి భగీరథ మహర్షి ఒక ఉదాహరణ అని అన్నారు. మన జిల్లాకు అది వర్తిస్తుందని, కరువు జిల్లా, తక్కువ వర్షంపడే ప్రాంతం అయినా కూడా ప్రభుత్వం ఉపాధి హామీ పథకం, జల్ శక్తి అభియాన్, లాంటి పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అందరూ మంచినీరు, తాగనీటిపై జవాబుదారీగా ప్రవర్తించాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయ. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ భగీరథ జయంతి సందర్భంగా భారతదేశ వ్యాప్తంగా ఉన్న సగర ఆత్మీయ బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుడు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టారు అనేది గుర్తుంచుకోవాలని, కరువు సీమలో నీటి కోసం తన శక్తి వంచన లేకుండా ధారపోసి భూమి లోపల నుంచి నీటిని తీసుకువచ్చి అపర భగీరథ ప్రయత్నం గురించి మనం మాట్లాడుకుంటామని, ఎంత కష్టంతో కూడుకున్నదైనా సాధించేందుకు మొక్కువోని దీక్షతో ప్రపంచంలోనే మానవాళికి ఉపయోగపడేటువంటిది భగీరథ ప్రయత్నంగా మనం భావించాలన్నారు. అలాంటి నీటి వనరులను గుర్తించి బయటకు తీసుకువచ్చి మనందరికీ స్ఫూర్తిదాయకమైన కఠోరమైన శక్తిని చూపించిన మహానుభావుడుగా భగీరథ మహర్షి మనందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాగు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నం చేస్తున్నారన్నారు. భగీరథుడు కేవలం ఉప్పర కులస్తులకు మాత్రమే దైవం కాదని, ఏ పని తలపెట్టినా ఆయన పూర్తిగా నిలిచే దైవమని అన్నారు. భువి నుంచి దివికి గంగను తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్లో కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం భగీరథ ప్రయత్నంలా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లను విద్యాశాఖ అధికారులు కట్టడి చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలో స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనం నందు ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లను చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవిం చిన విద్యాశాఖ అధికారులు సంబంధిత పాఠశాలలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు. శ్రీ చైతన్య , నారాయణ ,ఎడిఫై ,భాష్యం, ఏజీఎన్ ఎస్సార్ ,ట్రిల్లిస్ , కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేకసార్లు జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని వినతిపత్రం ధర్నాల రూపంలో తెలియజేసిన ఇంతవరకు ఒక విద్యాసంస్థలపైన కూడా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అడ్మిషన్లతో పాటు మరోవైపు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ తల్లితండ్రులను మోసం చేస్తున్నా రని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ పుస్తకాలు యూనిఫాము షూ టై బెల్ట్ రకరకాల వస్తువులు విద్యాసంస్థలలో వేల రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఒక విద్యాసంస్థలతో అనుమతి తీసుకొని రెండు మూడు విద్యాసంస్థలు నడుపుతున్నారని అన్నారు.జిల్లాలో చాలా విద్యాసంస్థలకు అనుమతులు లేకపోయినా నడుపుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా హాస్టల్లో అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవు దినాలలో, ఫస్ట్ ఇయర్ పూర్తిచేసుకున్న వారికి సెకండియర్ తరగతులు నిర్వహిస్తున్న కూడా ఆర్ఐఓ వారిపైన ఏం మాత్రం చర్యలు తీసుకోకుండా ఉన్నారని పేర్కొన్నారు .తక్షణమే కళాశాలలో నిర్వహిస్తున్న వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.జిల్లాలో ఆర్ఐఓ డీఈవో స్పందించి ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల పైన అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థల పైన ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు పాటించకుండా లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి నాని ,నగర సహాయ కార్యదర్శి సమీర్, నాయకులు ప్రవీణ్, తరుణ్, తౌకిర్, మెహది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగ పర్చుకోండి : ప్రభుత్వ విప్ కాలవ

విశాలాంధ్ర-రాయదుర్గం: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. కిమ్స్ సవేర ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ పాల్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏదైనా జబ్బు చేసినప్పుడో, ఆరోగ్య సమస్య వస్తేనో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకొంటారన్నారు. ఉచిత శిబిరాలు నిర్వహించినప్పుడు సాధారణగా బీపీ, ఇతరత్రా చిన్న వ్యాధులకు పరీక్షలు చేయించు కోటానికి వస్తారన్నారు. నిష్ణాతులైన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి శిబిరాల్లో పరీక్షలతో ప్రజలు పట్టించుకోని, వారికే తెలియని అంతర్గత వ్యాధులు బయటపడే అవకాశాలు ఉంటాయన్నారు. వైద్యుల సిఫార్సు మేరకు తదుపరి పరీక్షల్లో పూర్తి వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. అప్పుడు సరైన వైద్యం, ఆపరేషన్లు చేయటానికి వీలవుతుందన్నారు. వైద్య శిబిరం నిర్వాహకులు పి. పురుషోత్తం, పి.గౌరీలను కాలవ అభినందించారు. ఇలాంటి శిబిరాలు అన్ని వార్డుల్లో ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటాయన్నారు.

45 మంది పిల్లలకు ఉచిత ఖత్నా

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో హజరత్ సయ్యద్ షా జామలుద్దీన్ ఖాద్రి సాహెబ్ దర్గా ఆవరణలో హజరత్ సయ్యద్ షా అజమతుల్లా హుస్సేని సాహెబ్ ఆశీస్సులతో 'జామియా తాసీరియ ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ"వారి అధ్వర్యంలో ఆదివారం ఉచిత ఖత్నా క్యాంపునిర్వహించారు. దాదాపు 45 పిల్లలకు డాక్టర్లు ఖాజాపీరా, నిజముద్దీన్, బాషా మరియు లోకనాథ్ చేతుల మీదుగా ఖత్నా చేశారు. నవాజ్ ల్యాబ్ రహంతుల్లా రక్త పరీక్షలు చేయగా అలీ మెడికల్ స్టోర్ సలీం, నూరాని మెడికల్ స్టోర్ కరీం పిల్లలకు కావలసిన మందులు ఉచితంగా అందజేశారు. దీనితో పాటు అహ్మదాబాద్ నుండి ఆయుర్వేదిక్ డాక్టర్ మొహమ్మద్ అలీ తాసీర్ షిఫ ఖానా మరియు హిజమా సెంటర్‌లో ఉచితంగా కిడ్నీ స్టోన్ కు మరియు అపేండెక్స్ వున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు.

నకిలీ ఆర్ఎంపీ చేతుల్లో మరో మహిళ మృతి బాధాకరం

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఓను తక్షణమే సస్పెండ్ చేయాలి

బీసీవై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాప్ రెడ్డి



విశాలాంధ్ర-రాయదుర్గం: పట్టణంలో బళ్లారి రోడ్డు లో ఉన్న మూసా క్లినిక్‌లో ఆర్ఎంపీ వైద్యం వికటించి రెండో ప్రాణం కోల్పోవడం అత్యంత ఘోరమని, ఇది ముమ్మాటికి జిల్లా వైద్యాధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిందని బిసివై పార్టీ రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షులు, న్యాయవాది గౌని ప్రతాప్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని బీసీవై పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 40 రోజుల క్రితమే ఖలీల్ క్లినిక్ లో నకిలీ ఆర్ఎంపీ చేతుల్లో ఓ చిన్నారి మృతి చెందిన విషయం మరవకముందునే, పై తోటకు చెందిన బోయ పార్వతమ్మకి నిన్నటి రోజు మూసా క్లినిక్ నకిలీ ఆర్.ఎం.పి వైద్యులు అందించిన వైద్యం వికటించి మృతి చెందిందన్నారు. విషయం బయటకి పొక్కకుండా బేర సారాలతో డీలింగ్ చేయడం ఏంటంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారికి రాయదుర్గం ప్రజల ప్రాణాల పట్ల ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని, లెక్కలేదని విమర్శించారు. తాను అనేకసార్లు డి ఎం హెచ్ ఓ కు కాల్స్ చేస్తున్నప్పటికీ రిసీవ్ చేసిన పాపాన పోలేదన్నారు. మీడియా ముందు సైతం డీఎం అండ్ హెచ్ ఓ కు కాల్ చేసినప్పటికీ రిసీవ్ చేయలేదన్నారు. తక్షణమే వైద్య ఆరోగ్య శాఖా మంత్రివర్యులు విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యయహరిస్తున్న డీఎం అండ్ హెచ్ఓ పై చర్యలు తీసుకొని పదవి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ ఆర్.ఎం.పి వైద్యుల చేతుల్లో ప్రాణం పోతే మూడు లక్షలే అంటూ ప్రజానీకానికి అధికారులు సూచనలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు తక్షణమే నకిలీ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకొని రాయదుర్గం పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఆర్ఎంపి వైద్యులను కట్టడి చేయడంలో జిల్లా యంత్రాంగం మొత్తం విఫలం చెందిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాయదుర్గం కూడా ఒకటి ఉందని..మా రాయదుర్గం పేద ప్రజల పై దృష్టి సాదించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. గత నాలుగు నెలల్లోనే నలుగురు రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన పేద ప్రజలు నకిలీ ఆర్ఎంపి చేతుల్లో బలిఅయ్యారన్నారు.

10న కార్మిక సంఘాల జిల్లా సదస్సు జయప్రదం చేయండి..

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మి క చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10 న జరిగే జిల్లాస్థాయి సదస్సును జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, వైయస్ఆర్‌టియూసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఏఐఎఫ్‌టియూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా అమలు జరగడం లేదన్నారు. అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్రంలో 8 వ రాష్ట్రంలో, 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు.ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. సుప్రీం కోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న డిఏలు, సరెండర్ లీవ్స్ ఏన్క్యాష్ మెంట్లు వెంటనే ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, హమాలీ, వీధివ్యాపారస్తులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర డిమాండ్లపై జరుగు సమ్మెను జయప్రదం చేయడానికి ఈ నెల 10న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఏఐటియూసి నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సిఐటియూ నగర కార్యదర్శి ముత్తూజ, వైయస్ఆర్‌టియూసి నగర అధ్యక్షులు ఖాజా,చేతివృత్తుల సమాఖ్య నాయకులు లింగమయ్య,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ,ఆటో యూనియన్ నగర అధ్యక్ష,కార్యదర్శులు దుర్గాప్రసాద్,కృష్ణానాయక్ పాల్గొన్నారు.

గౌస్ మోద్దీన్ ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు జిరాయతి గౌస్ మోద్దీన్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలో గౌస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గౌస్ కార్యాలయం వద్ద జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులతో కలిసి గౌస్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీలో గౌస్‌కు పేరు ఉందన్నారు. బాలకృష్ణ అభిమానిగా సేవా కార్యక్రమాలు కూడా చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు రావాలని కోరుకున్నారు. నందమూరి అభిమానులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరెడ్డి



విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన కోటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డికి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డికి, యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డికి వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దివినుంచి భువికి గంగను తెచ్చిన మహానుభావుడు భగీరథుడు

విశాలాంధ్ర-హిందూపురం : ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు పట్టణంలో స్థానిక భగీరథ సర్కిల్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా మునిసిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప హాజరయ్యారు. అనంతరం భగీరథ విగ్రహానికి పూలమలలు వేసి జయహొ భగీరథ జయహొ భగీరథ అని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ మహర్షి తపస్సు ద్వారా దివి నుండి భువికి గంగను తెప్పించాడు. మనం ఏ కార్యక్రమాన్ని అయినా చేపట్టినప్పుడు విజయం చేకూరే వరకు ప్రయత్నిస్తూ, చివరిగా విజయాన్ని పొందితే ఆ విజయాన్ని భగీరథ ప్రయత్నంతో పోలుస్తుంటామని, అదేవిధంగా మన బాలయ్య కూడా గొల్లపల్లి నుండి హిందూపురంకి నీళ్లు తెప్పించి హిందూపుర ప్రజల గుండెల్లో నందమూరి బాలకృష్ణ భగీరథునిగా నిలిచిపోయారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట నారాయణ, కదిరప్ప, రామప్ప, శ్రీరామప్ప, అంజినప్ప, బసప్ప, అశ్వర్థప్ప, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగరీథ జయంతిని రాష్ట్ర పండుగగా చేయడం అభినందనీయం

విశాలాంధ్ర-సోమందేపల్లి: స్థానిక భగీరథ సర్కిల్ యందు ఉప్పర సగర కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ జెడ్పిటిసి తెలుగుదేశం సీనియర్ నాయకులు వెంకటరాముడు మాట్లాడుతూ అపర భగీరథుడి పండుగను రాష్ట్ర పండుగగి నిర్వహించేదుకు కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడం ఆనందించదగ్గ విషయమని అన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు వెంకటరమణ, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావ్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధితో పాటు పలు కులాలకు గుర్తింపు రావాలని, రాజకీయంగ,ఆర్థింక అందరు ఎదగాలనే సంకల్పంతో పలు కులాల పండుగలను రాష్ట్ర పండుగగ ప్రకటించిన ఘనత సియం చంద్రబాబుది అని,గత పాలకులు అన్ని కులాలను నిర్వీర్యం చేసారని,వైసిపి పాలనలో రాష్ట్రం కుదేలైందన్నారు,నేడు ఉప్పర సగర కులస్థుల కుల బాంధవుడు అయిన భగీరథుడి జయంతిలో నేను పాల్గొనడం సంతోషంగ ఉందన్నారు,ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు సిద్ది లింగప్ప, టవన్ కన్వీనర్ వడ్డే సూరి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డివి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఉప్పర బాబయ్య లోకేష్, రామకృష్ణ, తదితర ఉప్పర సగర కులస్థులు,కూటమి నేతలు,మహిళలు పాల్గొన్నారు.

ధరలిట్లా.. తినేదెట్లా..!

- కొండెక్కిన నిత్యావసర సరుకుల ధరలు
- ఏదీ కొనేటట్లు లేదు.. తినేటట్లు లేదు.. !
- పిల్లలకు పిడికెడు అన్నం ఎలా పెట్టాలి!
- సామాన్యులకు ఇల్లు గడవడమే గగనం
- ఉపాధి ఊష్.. అట్టడుగుకి ఆదాయం

విశాలాంధ్ర-కదిరి : నిత్యావసర వస్తువుల ధరలు మునుపెన్నడూ లేనంత విధంగా కొండెక్కి కూర్చున్నాయి. మార్కెట్‌లో పరిస్థితి చూస్తుంటే ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదన్న చందంగా ఏ వస్తువులు ముట్టుకున్న ఘాటు ఎక్కుతోంది. పంటలు పండక ఉపాధి అవకాశాలు, ఆదాయం కోల్పోయి పేద, మధ్య తరగతి వర్గాలు అనేక అవస్థలు పడుతున్నారు. సామాన్యులకు ఇల్లుగడవడమే గగనమవుతున్నది. ప్రతి కుటుంబంలో ఆదాయం గణనీయంగా పడిపోవడంతో జీవన విధానంలో మార్పులు చోటు చేసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటు తుండడంతో దానికి తగ్గ ఆదాయం పెరగక నిరుపేదలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలను పస్తులు ఉంచలేక కొందరు అప్పు పుట్టని వారు అర్ధాకలితో పస్తులు గడిపే పరిస్థితి నెలకొంది. దీంతో భవిష్యత్తు ఇంకెంత భయానకంగా ఉండబోతుందోనని తలచుకుని సగటు జీవి బెంబేలెత్తుతున్నాడు.

నూనెలు సలసల :

వంట నూనెలు ధరలు వేడి చేయకుండానే సలసల కాగుతున్నాయి. మార్కెట్లో ఈరోజు ఉన్న ధర రేపు ఉండడం లేదు.వేరుశనగ నూనె మరింత దారుణంగా ఉంది. నెల రోజుల కిందట కేజీ రూ.120-రూ.170, సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్, డాల్డా వంటివి సలసల కాగుతున్నాయి.

కూరగాయలతో గిజగిజ

కూరగాయల ధరలు మునుపెన్నడు లేనంత తీవ్రస్థాయిలో ఆకాశమే హద్దుగా పైపైకి దూసుకుపోతుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కేజీ రూ.80లోపు ఏ కూరగాయ కూడా మార్కెట్లో దొరకడం లేదు. సాధారణంగా పేదలు మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా వినియోగించే బెండ, దొండ, వంగ, టమోటా, బీర, సొర వంటి కూరగాయల్లో ఏ ఒక్కటీ కేజీ రూ.80లోపు దొరకడం లేదు. ఇక ఆకుకూరలు సైతం రూ.10కి కట్ట అమ్ముతున్నారు. ఇక చిక్కుడు, బీన్స్, క్యారెట్, బీట్‌రూట్ వంటి దుంప కూరగాయలు సామాన్యునికి అందనంత స్థాయికి ఎదిగాయి.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి, వెల్లుల్లి :

ప్రతి వంటకంలో అన్ని వర్గాలు ఉపయోగించే ఉల్లి కోయకుండానే కన్నీళ్లు పెట్టిస్తోంది. రైతు బజార్లలోనే ఉల్లి కేజీ రూ.50 అమ్ముతుండగా బయట మార్కెట్ లో రూ.70 వరకు, వెల్లుల్లి రూ.200, బయట రూ.240 విక్రయిస్తున్నారు. నాణ్యమైన ఉల్లి వెల్లుల్లి బ్లాక్ మార్కెట్‌కు తరలి పోవడంతో నాసిరకం మాత్రం సామాన్యులకు అందుబాటులో ఉంటున్నాయి.

అందని ద్రాక్షలా చికెన్, మటన్, గుడ్డు

చికెన్ మటన్ గుడ్డు ధరలు సామాన్యునికి అందని ద్రాక్షగా మారాయి. చికెన్ కేజీ ధర రూ.240, మటన్ కేజీ రూ. 850, గుడ్లు డజను(12) రూ.85 ఉన్నాయి. ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలన్నీ అంతు లేకుండా పెరుగుతున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ధరల నియంత్రణ అడ్డు అదుపు లేకుండాపోతున్నది. ఇకనైనా ప్రభుత్వాలు ధరల పెరుగుదలపై స్పందించి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కారుణ్య నియామకాల పత్రాలను అందించిన ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు

విశాలాంధ్ర-రోళ్ల: రెవిన్యూ శాఖలో పని చేస్తున్న ఇద్దరు వీఆర్ఏలు రత్నగిరి విఆర్ఎ చిక్కతిమ్మప్ప, రోళ్ల వీఆర్ఎ అశ్వత్తప్ప అకాల మరణం పొందడంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించింది. రత్నగిరికి చిక్కతిమ్మప్ప కుమారుడు రంగనాథ్ రోళ్ల అశ్వత్తప్ప కుమారుడు సందీప్ ఆదివారం మడకశిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకొన్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు షేక్షావలి, లక్ష్మినరసింహ (బుజ్జి), మండల సర్వేయర్ కిరణ్ కుమార్, ఆర్ఐ గిరియప్ప, వీఆర్వోలు నాగరాజు, లక్ష్మినరసింహ రంగనాథ్, నరసింహ మూర్తి చిరంజీవి, సర్వేయర్ జయరాం, టి.ఎన్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షులు బ్యాడగేరి మూర్తి పాల్గొన్నారు.

హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసం కేసులో పది మంది అరెస్టు

విశాలాంధ్ర-ధర్మవరం: రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నై కొత్తపల్లిలో ఏప్రిల్ నెలలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా, అప్పట్లో హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసం కేసులో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు మరో పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి నిందితుల కోసం చెన్నై కొత్తపల్లి పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం పదిమందిని నిందితులను అరెస్టు చేసి ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించారు. విచారించిన జడ్జి రిమాండుకు పంపినట్లు చెన్నై కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

సరస్వతి శిశుమందిర్ పాఠశాల పునఃప్రారంభానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 8వ వార్డులో(చెలిమి) దగ్గర గత కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల తిరిగి విద్యార్థుల కిలకిలలతో నిండే దిశగా అడుగులు వేస్తోంది. ఈ పాఠశాల స్థితిగతుల గురించి తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, పాఠశాల పునఃప్రారంభానికి అవసరమైన చర్యలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనం మరమ్మతులు, శుభ్రతా పనులు, గోడల రంగులు, విద్యుత్ నీటి సదుపాయాలు, టాయిలెట్లు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు స్వయంగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పాఠశాలపై మంత్రి ప్రత్యేక దృష్టి వహించడం వల్లే ఈ పునరుద్ధరణ సాధ్యమవుతోందని తెలిపారు. త్వరలోనే పిల్లల విద్యకు ఇది కేంద్రబిందువుగా మారనుంది అని అన్నారు. ఒకప్పుడు సరస్వతీ శిశు మందిరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కూడా మంచి ప్రతిభను కనపరచడం జరిగిందన్నారు.

చిత్రలేఖనం, నాట్యంపై శిక్షణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో ఆరవ రోజు చిత్రలేఖనం, నాట్యంపై శిక్షణ ఇవ్వడం జరిగిందని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ టీచర్, డాన్స్ టీచర్లచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ చదువుతోపాటు చిత్రలేఖనం నాట్యం జీవితంలో ఒక మంచి భవిష్యత్తుగా గుర్తింపుగా మిగిలిపోతుందని, ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. గ్రంథాలయాలలో చదువు, పోటీ పరీక్షలు, వివిధ విభాగాలకు చెందిన అంశాలకు గల పుస్తకాలు ఉచితంగా లభిస్తాయని వెల్లడించారు. నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 48 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు కార్యక్రమం లో రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలయ్యకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ జాతీయ రహదారి కర్ణాటక సరిహద్దు బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఎమ్మెల్యే బాలయ్యకు మండల కన్వీనర్ రంగారెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ఘన స్వాగతం పలికారు, ఎమ్మెల్యే బాలయ్య బెంగళూరు నుండి హిందూపురం విచ్చేస్తుండగా బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద చిలమత్తూరు మండల టిడిపి నాయకులు విరివిగా పాల్గొని ఆయనకు పూలమాలలు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

సన్మానానికి తరలిన టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర-చిలమత్తూరు : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డ్ అందుకున్న సందర్భంగా ఆదివారం కన్వీనర్ రంగారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ఆధ్వర్యంలో సోమగట్ట పంచాయతీ నుండి తిప్పారెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు అధికసంఖ్యలో సన్మాన కార్యక్రమానికి తరలివెళ్లారు, అదేవిధంగా మండల వ్యాప్తంగా 84 గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు పలువురు హిందూ పురం ఎంజీఎం గ్రౌండ్‌లలో నిర్వహించే సన్మాన కార్యక్రమానికి వెళ్లారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రఘువీరా రెడ్డి

విశాలాంధ్ర-గుడిబండ: మండలం పరిధిలోని ఎస్. రాయపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సి డబ్ల్యు సి మెంబర్ రఘువీరారెడ్డి, మరియు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయాల కొనసాగించాలని కోరారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 180 అంబేద్కర్ విగ్రహాలను అందించానని.రాబోయే రోజుల్లో భారత రాజ్యాంగాన్ని తెలుగు ముద్రణలో ముద్రించి ప్రతి గ్రామంలో చదువుకుంటున్న విద్యార్థులకు మహిళా సంఘ సభ్యులకు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే భారత రాజ్యాంగం అమలులోకి తీసుకువచ్చి వెనకబడిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ తదితర ఉప కులాలకు ఓటు హక్కును కల్పించి రిజర్వేషన్లు కల్పించి మానవులందరూ సమానంగా జీవించాలని తెలియజేసిన మహానుభావుడు భీమ్ రావు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమని అన్నారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ సమానంగా జీవించాలని అలాగే ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యను చదివించాలని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అవరోధించిన రోజే అంబేద్కర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని మరియు సమాజంలో అందరూ సమానంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సీనియర్ దళిత నాయకుడు బి.హెచ్ రాయుడు,మాజీ ఎంపీపీ ఎల్ కె నరసింహప్ప,మాజీ సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్,స్థానిక సర్పంచ్ రాధమ్మ హులి రాజు,రామతామన్న, స్థానిక యువ దళిత నాయకుడు రాయుడు, కొంకల్లు శివన్న,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు,అగలి లోకేష్,,స్థానిక నాయకులు నాగేంద్రప్ప వాజీ స్వామి,ఈరన్న, తదితరులు అధికసంఖ్యలో పాల్గొని అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం

విశాలాంధ్ర, తాడిమర్రి : మండల పరిధిలోగల పిన్నదరి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000 నుంచి 2004 వరకు చదివిన విద్యార్థిని విద్యార్థులు ఆదివారం రోజున గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. తమతోటి విద్యార్థిని విద్యార్థులు క్షేమ సమాచా రాలు సుఖసంతోషాలు సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు ముఖ్య ఉద్దేశం ఏమనగా తమ తోటి మిత్రులు ఏమైనా ఇబ్బందుల్లో ఉంటే వారి ఆర్థిక పరిస్థితులను చూసి వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక అందర్నీ ఒక్కటి చేసే విధంగా తోడ్పడుతుందని విద్యార్థిని విద్యార్థులు తెలియజేశారు ఈ కార్యక్రమానికి 2000 నుంచి 2004 వరకు విద్యను బోధించిన హెడ్మాస్టర్ దివాకర్ రెడ్డి నారపరెడ్డి ఉపాధ్యాయులు సురేష్ నాగరాజు రాధాకృష్ణ వసంత లక్ష్మి పరిహాన గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి గురువుల ఆశీర్వాదం తీసుకొని గురు కృతజ్ఞత చాటుకున్నారు అనంతరం గురువులకు విందు భోజనం ఏర్పాటు చేసి విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు ఇలాంటి కలయిక అప్పుడప్పుడు చేసుకోవాలని మనలో ఆర్థిక ఇబ్బందులతో ఎవరైనా ఉంటే తలా కొంచెం సాయం చేసి మన స్థాయికి తీసుకురావాలని ఏక అభిప్రాయానికి వచ్చారు

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై ఆరోపణలు సమంజసం కాదు

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచింది కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అని మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కాచెర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ గజ్జల శివ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 11 నెలల కూటమి పాలనలో అవినీతి దందాలకు కేరాఫ్‌గా మారడం జరిగిందని, ఇది అక్షరాల సత్యమని వారు స్పష్టం చేశారు. 11 నెలల ఎన్డీఏ పాలనలో ప్రజలు విసుగు చెందడం జరిగిందని, ప్రజలు అందరూ గమనిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఇసుక మట్టి మాఫియా రాజ్యమేలుతున్నాయని లక్షలు గడుస్తున్నారని వారు ఆరోపించారు. ఈ మాఫియాకు అడ్డుకట్టు వేయాల్సిన అధికారులే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని వారు మండిపడ్డారు. రెవెన్యూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో లంచాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పై నిరాహార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, వారు అభివృద్ధి చేసిన వాటిని ఒక్కసారి పరిశీలిస్తే అంతా అర్థమవుతుందని వారు సలహా ఇచ్చారు. నిజంగా అభివృద్ధి ఎవరు చేశారో ధర్మవరం ప్రజలకు తెలుసునని వారు తెలిపారు. పట్టణానికి తాగునీటి పథకాన్ని తెచ్చి నీటి ఎద్దడిని నివారించిన నాయకుడు మా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అని తెలిపారు. కేతిరెడ్డి హయాంలో 24 వేల ఇంటి పట్టాలను మంజూరు చేశారన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తాము అభివృద్ధి పనులకు ఎప్పుడు కూడా అడ్డురామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఎన్డీఏ నాయకులు నిరాధారమైన మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి కౌన్సిలర్లు పెనుజూరు నాగరాజు, రమాదేవి, చింతా పుల్లయ్య, అత్తర్ జిలాన్, వార్డు ఇన్చార్జులు భాష, కేశగాల కృష్ణ, కత్తి పెద్దన్న ,మట్టిద్దుల కేశవరెడ్డి, గడ్డం రంగా, బాలగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవముల వేడుకలు అత్యంత వైభవంగా ఆదివారం ప్రారంభించామని ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. సాయంత్రం ఆలయం నుండి ఉభయ దాతలైన గజనాన్ని పట్టుసాలే సంఘం- సెమీ నారాయణ స్వామి దేవాలయం వరకు మేళ తాళాలతో చేరుకున్నారు. అక్కడ వివిధ పూజలు ముగిసిన తర్వాత తిరిగి చెన్నకేశవ స్వామి ఆలయమునకు చేరుకున్నారు. తదుపరి వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ గజ నాణ్య పట్టు సాలే వారు తెచ్చిన గరుడ ఆహ్వాన చిత్రపటాన్ని ప్రత్యేక పూజలను అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భాను ప్రకాష్ చక్రధర్లు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో ఉభయ దాతలు నడుమ ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించబడునని తెలిపారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన కేరళ వాయిద్యం, అన్నమయ్య సంకీర్తనలు భక్తాదులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున, కిట్టప్ప పాల్గొన్నారు.

200 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు

శస్త్ర చికిత్సలకు 130 మంది ఎంపిక

విశాలాంధ్ర - అగళి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఆర్‌డీటీ ఆడిటోరియంలో ఆదివారం జెడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. మండల వ్యాప్తంగా 200 మందికి కంటి రోగులు ఉచిత పరీక్షలు నిర్వహించారు. 130 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపికైనట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. వారిని బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి బస్‌లో బెంగళూరు కు తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి మళ్లీ అగళికి చేర్చడం జరుగుతుందన్నారు. ఉచితంగా కంటి అద్దాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కుమారస్వామి మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఇరిగేపల్లి శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, శిల్ప కేంచుయాదవ్ మండల ప్రధాన కార్యదర్శి జయన్న డాక్టర్ కృష్ణప్ప, కమ్మరి శివన్న, అలీ ఖాన్, తదితర దేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

ప్రశాంతంగా ముగిసిన ఎంజెపి సెట్ పరీక్షలు

విశాలాంధ్ర-గుడిబండ : స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎంజెపి సెట్ పరీక్షలు ఆదివారంతో ప్రశాంతంగా ముగిశాయి. కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ మాట్లాడుతూ మా కళాశాలకు 250 మంది విద్యార్థులను కేటాయించామని, ఆదివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 179 మంది విద్యార్థులు హాజరై 71 మంది విద్యార్థులు గైర్హాజయ్యారని తెలిపారు. అంతా సజావుగా సాగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి సహకారంతో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ అంబేద్కర్ సర్కిల్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవితమ్మ ఆదేశాలమేరకు ఆమె భర్త వెంకటేశ్వరరావు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ఎండలు విపరీతంగా ఉన్న దృష్ట్యా ప్రయాణికులకు, బాటసారులకు దాహం తీర్చాలని ఉద్దేశంతో చలివేంద్రం సౌకర్యాన్ని ఏర్పాటుచేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరాముడు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మండల కన్వీనర్ సిద్దయ్య, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, సర్పంచి శ్రీనివాసులు, మాజీ సర్పంచి అశ్వర్థప్ప, టైలర్ ఆంజనేయులు, పాలడుగు చంద్ర, త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, సాయి ప్రసాద్, పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులతో విజ్ఞాన వికాసం

విశాలాంధ్ర-ధర్మవరం: వేసవి శిక్షణా తరగతులు విజ్ఞాన వికాసాన్ని పెంపొందిస్తాయని ఓం శాంతి సేవా కేంద్రం సంచాలకురాలు బి కే. రాధా అక్క తెలిపారు. పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల ప్రజాపిత బ్రహ్మకుమారి కార్యాలయంలో శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. రాధా అక్క మాట్లాడుతూ ఈ శిక్షణా శిబిరాలు ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఉంటాయని, ఆదిలక్ష్మి బాల వికాస్ నిర్వాహకులు పిల్లలకు హైందవ సాంప్రదాయం, శ్లోకాలు చెబుతారన్నారు. కరుణాకర్ విద్యార్జన కసిగా ఎలా చేయాలి? జీవితములో ఒక రాజుగా ఎలా బతకాలి ?అన్న విషయాలను పిల్లలకు అద్భుతంగా వివరించారు.. రాధా అక్క మానవునిలోని ఉన్న అద్భుతమైన శక్తిని ఎలా వెలికి తీయాలనే విషయాన్ని వివరించారు. శిబిరంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఆసక్తిగల వారు శిక్షణలో ఇంకను పాల్గొనవచ్చన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్‌లో గల షిరిడి సాయి బాబా దేవాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని షిరిడి సాయి బాబా సేవా సమితి అధ్యక్షులు వీరనారాయణ కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు. 135 మంది కంటి పరీక్షల కొరకు రాగా 50 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. శిబిరానికి వచ్చిన అందరికీ భోజన వసతి కల్పించామన్నారు. ఈ శిబిరం ధర్మవరం శ్రీ శిరిడి సాయిబాబా సేవాసమితి, కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. కంటి నిపుణుల సలహాలతో కంటికి ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వైద్యులు, సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 5, మే 2025

సమాచారం పొందడం మన హక్కు

సమాచార హక్కు.. కాపాడుకుందాం.. ఈ చట్టంపై ఇప్పటికీ ఎంతో మందిలో అవగాహన లోపం కేవలం రూ.10తోనే సమాచారం పొందవచ్చు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : సమాచార హక్కు చట్టం ప్రజలకు ఓ వరం. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథ కాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవడం కోసం ఎంతో మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ ఉంటారు. సమాచారం పొందడా నికి ఓ చట్టం ఉందని ఇప్పటికీ ఎంతో మందికి తెలి యకపోవటం శోచనీయం. ప్రభుత్వ పాలనకు సం బంధించి ప్రతి విషయం ప్రజలు తెలుసుకునేం దుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) ఉంది. సామాన్యులు కూడా ఈ యాక్టు సద్వినియోగం చేసుకోవచ్చు. కేవలం రూ.10తో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి సమాచారం అయినా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై కచ్చితంగా ఉంది.

ఏఏ అంశాలపై సమాచారం.. ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారమే సమాచార హక్కు చట్టం కల్పిస్తోంది. ఈ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని, కావాల్సిన వివరాలు తెలుసు కోవచ్చు. ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం. ఇతరత్రా అంశాలను తెలుసుకోవచ్చు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాల యాల్లో సహాయ పౌర సమాచార అధికారి, పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రజలకు కనిపించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా ఉంచకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంది.

సమాచారం కోరే విధానం... సమాచారం కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుం ది. ఏదైనా సమాచారం కావాల్సిన వారు... తెల్ల కాగితంపై రాసి దరఖాస్తు చేసుకున్నా సరిపోతుంది. దీనిపై అవగాహన లేకపోతే పౌర సమాచార అధికారి సహాయం తీసుకోవచ్చు. కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం. కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు.. వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవి అయితే తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది.

ఫీజు ఇలా... తెల్ల రేషన్ కార్డుదారులకు దరఖాస్తు రుసుం ఉచి తం. గ్రామ స్థాయి సమాచారానికి దరఖాస్తు రుసుం లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. దీనిని డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో చెల్లిం చవచ్చు. సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వ డానికి అయ్యే ఖర్చును దరఖాస్తు చేసుకున్న వారు చెల్లించాలి. దరఖాస్తు ఫీజుతో పాటు ముద్రణ రూపంలో కోరితే పేజీకి రూ.2 చొప్పున జిరాక్స్ ఖర్చులు, సీడీ రూపంలో రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం. తర్వాత ప్రతి గంటకు రూ.5 చొప్పున చెల్లించాలి.

సమాచారం పొందే అంశాలు.... ఆర్టీఐ చట్టం ద్వారా పత్రాలు, మెమోలు, రికార్డులు, పత్రికా ప్రకటనలపై అడగవచ్చు. ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్ బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, నమూనాలు, తనిఖీ, రికార్డులు మొదలైనవి ఉండొచ్చు. ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. రేషన్ డీలర్ల రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, లబ్ధిదారుల వివరాలు, సీఎం సహాయ నిధి వివరాలు, ప్రజాప్రతినిధుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు, వినియోగం తదితర వివ రాలు కాగితాలు, అధికారులపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్న పలు అంశాల గురించి పేపర్ స్టేట్మెంట్, వీడియోల రూపంలోనూ పొందవచ్చు.

పేదలందరికీ కంటి వెలుగును ప్రసాదించడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యం

అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలందరికీ కంటి వెలుగును ప్రసాదించడమే యువర్స్ ఫౌండేషన్ లక్ష్యము అని అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. ఆదివారం వారు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (వన్టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా)లో యువర్స్ ఫౌండేషన్, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు కందికేరి బసమ్మ, కీర్తిశేషులు కందికేరి సోమశేఖర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వ్యవహరించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ శిబిరంలో 98 మంది కంటి పరీక్షలు చేయించుకోగా అందులో 41 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. వీరికి ఉచిత ఆపరేషన్ తో పాటు ఉచిత వసతి కూడా కల్పించబడునని తెలిపారు. అనంతరం కంటి వైద్యులు కంటిపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వివరించడం జరిగిందని తెలిపారు.

తదుపరి దాతలను ఘనంగా సన్మానిస్తూ షీల్డ్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, క్యాంపు చైర్మన్ కళ్యాణ్ చక్రవర్తి, చాంద్ బాషా, జయంతి వినోద్ కుమార్, ఆప్తాలమిక్ అధికారి సికిందర్, రామాంజనేయులు, నామాల శ్రీనివాసులు, కౌన్సిలర్ కేతా లోకేష్, పే సుజూరు నాగరాజు, రేబిగుంట్ల నాగార్జున తదితరులు పాల్గొన్నారు

ఆయ్యప్ప స్వామి ఆలయ ప్రారంభోత్సవ మహెూత్సవ వేడుకలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కేశవ నగర్‌లో ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అయ్యప్ప స్వామి దేవాలయ ప్రారంభోత్సవము విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహెూత్సవ వేడుకలకు ప్రజలు భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురు స్వామి పి జే. విజయ్‌కుమార్, బండ్లపల్లి వెంకట జయప్రకాష్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, అయ్యప్ప స్వామి దేవాలయ ట్రస్ట్ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు దేశవ్యాప్తంగా అయ్యప్ప స్వామి మహిమలు విస్తరించాయని, ఇందులో భాగంగా ఆ అయ్యప్ప స్వామి దేవాలయమును దాతలు, భక్తాదులు సహాయ సహకారములతో నిర్మాణం చేపట్టడం మాకెంతో ఆనందదాయకమని తెలిపారు. ఈనెల 10వ తేదీ శనివారం మహాగణపతి పూజ యాజమాన్య సంకల్పం దీపస్థాపన తదితర కార్యక్రమాలు, 11వ తేదీ స్వస్తివాచనం, నవగ్రహ మంటపరాధనం, అగ్ని ప్రతిష్ట హెూమాలు కార్యక్రమాలు, సాయంత్రం మూలమూర్తుల గ్రామోత్సవం, 12వ తేదీ సోమవారం మోదక మహాగణపతి హెూమం పూర్ణాహుతి విష్ణు సహస్ర నామార్చనలు, 13వ తేదీ మంగళవారం ఆవాహిక దేవత హెూమములు గోపుర మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు, 14వ తేదీ బుధవారం యంత్ర ప్రతిష్ట విగ్రహ ప్రతిష్టాధులు తదితర కార్యక్రమాలతో పాటు మహా కుంభాభిషేకం అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట, సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ ఐదు రోజుల కార్యక్రమాలకు వందల సంఖ్యలో ప్రజలు భక్తాదులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం 1999-2000 విద్యా సంవత్సర పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం అత్యంత ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముందుగా సరస్వతీదేవి చిత్ర పటానికి పూలమాలలు వేసి తమ గౌరవ ప్రపత్తులు చాటుకున్నారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పూల హారాలు శాలువాలతో ఘనంగా సన్మానించారు 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాలు వివిధ వ్యాపారాలలో స్థిరపడ్డ మిత్రులు ఒకరి నొకరు చిన్ననాటి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నబి రసూల్, రవి కుమార్ రెడ్డి ,రామకృష్ణా, పద్మనాభ రెడ్డి ముత్యాల రెడ్డి, అరుణ, సునీత , ప్రసన్న లక్ష్మీ వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

విశాలాంధ్ర-కూడేరు: కూడేరు గ్రామంలో టిడిపి పార్టీలో చురుకుగా పాల్గొంటున్న సీనియర్ అయిన ఎడమల శివయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి వారి ఇంటికి వెళ్లి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాట వెంకటేశు, జయప్రకాష్ గౌడ్, బొమ్మయ్య, నారాయణస్వామి, శ్రీధర్ నాయుడు, గొల్ల వెంకటేష్, అంతే బీమా, రాయమ్మొల్ల వెంకటేష్,చిన్న ఈశ్వరయ్య, నీళ్ల శివ, కొడిమి మల్లోవులు, బలిజ శ్రీనివాసులు, గంటముక్కల రమేష్, బషీర్ భాష, మసూద్ వలి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసం కేసులో పది మంది అరెస్టు

విశాలాంధ్ర-ధర్మవరం: రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నై కొత్తపల్లిలో ఏప్రిల్ నెలలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా, అప్పట్లో హెలికాప్టర్ విండ్ షీల్డ్ ధ్వంసం కేసులో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు మరో పదిమందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి నిందితుల కోసం చెన్నై కొత్తపల్లి పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం పదిమందిని నిందితులను అరెస్టు చేసి ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించారు. విచారించిన జడ్జి రిమాండుకు పంపినట్లు చెన్నై కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అగళి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పిటిసి ఉమేష్ కన్వీనర్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం మండల తెలుగుదేశం నాయకులు అభిమానులు కార్యకర్తలు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.ఇలాంటి జన్మదినం వేడుకలను మరెన్నో జరుపుకోవాలని జడ్పిటిసి ఉమేష్ తెలిపారు, అనంతరం మడకశిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో జరిగే నియోజకవర్గ స్థాయి జన్మదిన వేడుకలకు మండల నాయకులు తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ కుమారస్వామి మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఇరిగేపల్లి శ్రీనివాస్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శిల్పకంచు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి జయన్న, డాక్టర్ కృష్ణప్ప, కమ్మరి శివన్న, డీలర్ రాజన్న మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, సునీల్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి, జై భీమ్ ర్యాలీ విజయోత్సవ సభ

రాష్ట్ర.జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు

విశాలాంధ్ర-పెనుకొండ: బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నిర్వహించిన అంబేద్కర్ జయంతి, జై భీమ్ ర్యాలీ, విజయవంతం మ హెూత్సవం సభ బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అధ్యక్షతన ఆదివారం పెనుకొండ పట్టణంలోని మార్కెట్ యార్డ్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన ముఖ్య అతిథులకు, బహుజన చైతన్య వేదిక కార్యవర్గ సభ్యులకు, పాల్గొని విజయవంతం చేసిన బహుజన లందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. సమావేశంలో బహుజన చైతన్య వేదిక రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బహుజన చైతన్య వేదిక రాష్ట్ర జిల్లాల కార్యవర్గ రాష్ట్ర అధ్యక్షులు: హెచ్. శివరామకృష్ణ హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షుడు: రంగేపల్లి నాగరాజు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: పెనుకొండ రవి కుమార్,రాష్ట్ర కార్యదర్శి: గుడిబండ భూతరాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు: రొద్దం బాబు ప్రసాద్, రాష్ట్ర గౌరవ సలహాదారులు1: చాలాకూరు హనుమంతప్ప, బీచగానిపల్లి రామాంజినప్ప, రాష్ట్ర గౌరవ సలహాదారులు పీ.సూర్యనారాయణ, మునిమడుగు నరసింహప్ప, రాష్ట్ర కోఆర్డినేటర్ హిందూపూర్ యం.ఆనంద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్: హిందూపురం నాగార్జున, రాష్ట్ర ట్రెజరర్: రాంపురం రామాంజినప్ప. రాయలసీమ ఇంచార్జి: వైహెచ్ అంజినప్ప, రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ రోళ్ళమంజునాథ, జనరల్ సెక్రటరీ:గోరంట్ల సురేష్ రీజినల్ జాయింట్ సెక్రటరీ: అగలీ లోకేష్. జిల్లా కమిటీ **అనంతపురం - సత్య సాయి జిల్లా అధ్యక్షులు:** చల్లాపల్లి ఈశ్వర్,జిల్లా ఉపాధ్యక్షులు: కోనాపురం కొల్లప్ప గౌరవ అధ్యక్షులు: రంగేపల్లి కదిరప్ప, పైడేటి గంగాధరప్ప,అమరాపురం కెంచప్ప, జిల్లాకోఆర్డినేటర్: కంబాలపల్లి నరేష్, జిల్లా యూత్ కమిటీ జిల్లా యువజన అధ్యక్షులు పెనుకొండ శశికుమార్, పవన్ కుమార్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ పైడేటి రామదాస్ జిల్లా వర్కింగ్ ప్రెసిసిడెంట్స్ కోనాపురం మూర్తి, రొద్దం తిరుపతయ్య జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ ఎర్రగుంటకుమార్ జిల్లా యూత్ సెక్రటరీ మందలపల్లి రామాంజి నియమించారు.

వైసీపీ మండల కో కన్వీనర్‌గా చెన్నకేశవులు



విశాలాంధ్ర-పెనుకొండ : వైసీపీ మండల కో కన్వీనర్‌గా కురుబ వాండ్లపల్లికి చెందిన చెన్నకేశవులు మండల కార్యదర్శిగా కురుబ ఆంజనేయు లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు పట్టణంలో వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ వీరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు మీరు పార్టీకి చేసిన కృషిని గుర్తించి పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తనపై నమ్మకంతో పార్టీలో ప్రాధాన్యత కల్పించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు పార్టీ ప్రతిష్టకై శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. వీరికి పార్టీ కార్యకర్తలు పూలమాలలతో సత్కరించారు.

పట్టద దేవర జాతర కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి..

విశాలాంధ్ర-కణేకల్లు: హనకనహాల్ గ్రామంలో కురుబ కులస్తుల దేవర జాతరలో ముఖ్యఅతిథిగా వైసీపీ మెట్టు గోవింద్ రెడ్డి.. శని ఆదివారం రోజులలో జరిగిన శ్రీ బచ్చుకలేశ్వర స్వామి దేవర వారి జాతర సందర్భంగా ఓసికెరప్ప దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం కురుబ కులస్థులు నిర్వహించిన శ్రీ బచ్చనకల్లేశ్వర స్వామి పట్టద దేవర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయదుర్గం నియోజకవర్గం వై.యస్.ఆర్. పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వడ్డెర్లు ఐక్యమవ్వాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: వడ్డెర్లు అందరూ సమస్యల పరిష్కారానికి ఐక్యమవుదామని ఉరవకొండ పట్టణం వడ్డెర్ల సంఘం నూతన అధ్యక్షులు సంజీవ రాయుడు అన్నారు. ఆదివారం ఉరవకొండ పట్టణంలో వడ్డెర్ల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సంజీవ రాయుడు, ఉపాధ్యక్షులుగా లాలూ స్వామి, వి.శివ, ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య, కార్యదర్శి చిన్నబాబు, శివకుమార్, కోశాధికారి గంగరాజు, గౌరవ సలహాదారులు వి.రమేష్ వి.మారెన్న మరియు కార్యవర్గ సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సంజీవ రాయుడు మాట్లాడుతూ వడ్డెర్లు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారం కోసం కృషి చేద్దామని తెలిపారు. వడ్డెర్లకు 50 సంవత్సరాలకే పింఛన సదుపాయం కల్పించాలని కొండ క్వారీలల్లో 35 శాతం కేటాయించాలని ప్రమాద వశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఉరవకొండ పట్టణంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దాం అని తెలిపారు. సంఘం నాయకులు సమన్వయంతో ముందుకెళితేనే వడ్డెర్లకు తగిన న్యాయం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గోవిందు నాయక్

విశాలాంధ్ర-ఉరవకొండ : వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా వజ్రకరూరు మండలం వెంకటంపల్లి చిన్న తాండకు చెందిన ఒడితాయ గోవింద నాయక్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన గోవింద నాయక్ ఆదివారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంగా జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో వైఎస్ఆర్‌సిపి పార్టీ బలోపేతానికి గిరిజన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మెట్టు గోవిందరెడ్డి



విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : పూలకుర్తి గ్రామంలో జంబన్న తాత దేవస్థానంలో వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కురువ కులస్థులు నిర్వహించిన నిలగిరేశ్వర స్వామి పట్టద దేవర కార్యక్రమంలోని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రజాప్రతి నిధులు, సర్పంచులు, వివిధ అనుబంధ కమిటిల అధ్యక్షులు పాల్గొన్నారు.

10న కార్మిక సంఘాల జిల్లా సదస్సు జయప్రదం చేయండి..

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మి క చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జరిగే జిల్లాస్థాయి సదస్సును జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, వైయస్ఆర్‌టియూసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఏఐఎఫ్‌టియూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా అమలు జరగడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్రంలో 8వ రాష్ట్రంలో, 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు.ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. సుప్రీం కోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న డిఏలు, సరెండర్ లీవ్స్ ఏన్క్యాష్ మెంట్లు వెంటనే ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, హమాలీ, వీధివ్యాపారస్థులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర డిమాండ్లపై జరుగనున్న సమ్మెను జయప్రదం చేయడానికి ఈ నెల 10న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఏఐటియూసి నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, సిఐటియూ నగర కార్యదర్శి ముత్తూజ, వైయస్ఆర్‌టియూసి నగర అధ్యక్షులు ఖాజా,చేతివృత్తుల సమాఖ్య నాయకులు లింగమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ,ఆటో యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు దుర్గాప్రసాద్,కృష్ణానాయక్ పాల్గొన్నారు.

గౌస్ మోద్దీన్ ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు జిరాయతి గౌస్ మోద్దీన్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలో గౌస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గౌస్ కార్యాలయం వద్ద జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులతో కలిసి గౌస్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీలో గౌస్‌కు పేరు ఉందన్నారు. బాలకృష్ణ అభిమానిగా సేవా కార్యక్రమాలు కూడా చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు రావాలని కోరుకున్నారు. నందమూరి అభిమానులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన కోటేశ్వరరెడ్డీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం కోటేశ్వరరెడ్డీ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డికి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డికి, యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డికి వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.